

జాతీయ పురస్కారం అందుకున్న ఆశాజ్యోతి

ప్రజాశక్తి - పెరవలి

మండలం కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి యూనిట్ ఎస్‌టిఎస్‌గా విధులు నిర్వహిస్తున్న వి.ఆశజ్యోతి విజయవాడ శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకల్లో జాతీయ స్థాయిలో ఉమెన్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు పేరుతో నారీరత్న అవార్డును అందజేశారు. శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపకులు కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజయవాడ మహిళా పోలీసు స్టేషన్ ఎసిపి కె.లతకుమారి, సిఐ రమణమ్మ, బిజెపి మహిళా రాష్ట్ర కార్యదర్శి నర్సిపల్లి హారిక చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆశాజ్యోతిని పలువురు అభినందించారు.

వాటర్ గ్రిడ్ పట్టాలెక్కేనా..?

- రూ.1,650 కోట్లతో నిర్మాణానికి యోచన
- రెండేళ్లు దాటినా ముందుకు కదలని పనులు
- స్వచ్ఛ నీటి కోసం ప్రజల ఎదురు చూపులు

అఖండ గోదావరి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తూర్పు, మధ్య డెల్టా పరిధిలో ఉన్న 36 మండలాల్లో ఉన్న 1600 గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛ తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం 'వాటర్ గ్రిడ్' పథకాన్ని తీసుకొచ్చింది. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని రూపొందించారు. కానీ వైసిపి సర్కారు ఒక రూపాయి కూడా కేటాయించలేదు. ఐదేళ్లు గడిచిపోయి అధికారం కోల్పోయింది. దీంతో ఈ పథకం మూలకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటర్ గ్రిడ్ పథకాన్ని తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. 9 నెలలు గడుస్తున్నప్పటికీ ఈ పథకంపై కూటమి ప్రభుత్వంలోనూ ఒక్క అడుగు ముందుకు పడడం లేదు. దీంతో శుద్ధ జలం కోసం ఎదురుచూస్తున్న సాధారణ ప్రజానీకానికి నిరీక్షణ తప్పడం లేదు. ఈ పథకం ఎప్పటికీ అమలవుతుంది? ఎప్పుడు పనులు ప్రారంభమవుతాయి..? ఎప్పటికీ పూర్తవుతాది? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి.

ఇదీ ప్రణాళిక

గోదావరి నీటిని శుద్ధిచేసి పైపులైను ద్వారా మళ్లించి ఇంటింటికి కుళాయి ద్వారా రోజుకి ఒక మనిషికి 55 లీటర్ల శుద్ధమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును తీసుకొచ్చారు. 2054 సంవత్సరం వరకు గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాల కోసం ప్రణాళికను సిద్ధం చేశారు. ధవలేశ్వరం బ్యారేజి ద్వారా 2.153 టిఎంసిల గోదావరి నీటిని ఫిల్టర్ చేసి తూర్పు డెల్టాలోని 511 ఆవాస ప్రాంతాల పరిధిలోని 10.31 లక్షల మందికి, మధ్య డెల్టాలో 1100 ఆవాస ప్రాంతాల్లో 10.49 లక్షల మందికి నీరు అందివ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఆత్రేయపురం మండలం వెలిచేరు, కడియం మండలం జేగురుపాడులలో ఫిల్టర్ ప్లాంట్లను నిర్మిస్తారు. బొబ్బర్లంక, ధవళేశ్వరంలలో ఇంటెక్ వెల్స్‌ను ఏర్పాటు చేస్తారు. గోదావరి నీటిని ఇంటెక్ వెల్స్ ద్వారా పంపింగ్ చేసి ఫిల్టర్ ప్లాంట్ లకు పంపుతారు. అక్కడ ఫిల్టర్ అయినా తాగునీటిని పైపులైను ద్వారా నిర్దేశించిన ప్రాంతాలకు కుళాయిల ద్వారా స్వచ్ఛ నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికను రూపొందించారు.

కేంద్రం 50, రాష్ట్రం 50 శాతం నిధులు

కేంద్రం 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం మరో 50 శాతం నిధులను ఈ ప్రాజెక్టుకు కేటాయించాల్సి ఉంది. మొత్తంగా రూ.1650 కోట్ల నిధులతో దీనిని నిర్మించాలని భావించారు. గత ప్రభుత్వం హయాంలో కేంద్రాన్ని వైసిపి సర్కారు నిధులను అడగలేక పోయింది. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు కేటాయించేందుకు కనీస ప్రయత్నం చేయలేదు. దీంతో ఈ పనులు ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది. దీంతో నేటికీ ఈ పథకం పట్టాలెక్కలేదు. ఎన్‌డిఎ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు ఈ ప్రాజెక్టు నిధుల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వ హయాంలోనే పనుల నిర్వహణకు టెండర్లు ప్రక్రియ పూర్తయ్యాయి. 2025 జూన్ 25 నాటికి పనులు పూర్తి కావాలని కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం జరిగి రెండేళ్లు పైనే పూర్తయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల విడుదలలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో ప్రాజెక్ట్ పనులపై నీలినీడలు అలుముకున్నాయి.

సురక్షిత నీటి కోసం అల్లాడుతున్న జనం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ప్రాంతాల ప్రజలు నేటికీ తాగునీటి సమస్యను తీవ్రస్థాయిలో ఎదుర్కొంటున్నారు. గోదావరి పక్కనే ఉన్నా సురక్షిత తాగునీరు సక్రమంగా అందని పరిస్థితులు ఉన్నాయి. నేటికీ పలు ప్రాంతాల ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతుంది. దీంతో అనేకమంది రోగాల భారిన పడుతున్నారు. ప్రభుత్వాలు తాగునీటి అవసరాల కోసం పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తున్నామని చెప్పుకుంటున్నప్పటికీ ఆచరణలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. దీంతో అనేకమంది గ్రామీణ ప్రాంత ప్రజలు సురక్షిత తాగునీటి కోసం అనేకేళ్లుగా ఎదురు చూస్తున్నారు. ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుంది? ఎప్పుడు స్వచ్ఛ తాగునీరు అందుతుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వేధిస్తున్న భూ సేకరణ

భూ సేకరణ సమస్య వేధిస్తోంది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల విడుదలలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో ప్రాజెక్ట్ ఎప్పుడు ప్రారంభమవుతుందనేది నేటికీ స్పష్టత లేకుండా పోయింది. ఇప్పటికే అధికారులు సుమారు 650 కిలోమీటర్లు సర్వే పూర్తి చేశారు. జేగురుపాడులో 11 ఎకరాలు భూసేకరణ పూర్తి చేశారు. అయితే ప్రభుత్వం దీనికి బడ్జెట్ ను విడుదల చేయలేదు. వెలిచేరు గ్రామం వద్ద 10 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. ఇవన్నీ జరగాలంటే తొలుత ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. అప్పుడే ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశం ఉంటుంది.

త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం

వాటర్ గ్రిడ్ పథకం పనులు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది. టెండర్లు త్వరలోనే పూర్తవుతాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వే జరుగుతుంది. కూటమి ప్రభుత్వం నిధులను కేటాయిస్తే పనులు త్వరగా మొదలు పెట్టి పూర్తి చేస్తాము.

- ఎన్. భారతి, ఇన్‌ఛార్జ్ ఎస్ఇ, ఆర్ డబ్ల్యూఎస్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, స్టాలిన్ తదితరులు

భవిష్యత్తుకు మార్గదర్శకం చేసేదే చరిత్ర

'నవ సమాజం కోసం' పుస్తకావిష్కరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

భవిష్యత్తుకు మార్గదర్శకం చేసేదే చరిత్ర అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కాకినాడలోని అన్నదాన సమాజంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషబాబ్జి రచించిన 1934 నుంచి1964 వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ఘట్టాలు 'నవ సమాజం కోసం' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అంటే ఆ కాలంలో ప్రజా పోరాటాల చరిత్రే అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్వాతంత్రోద్యమ కాలంలోనే కమ్యూనిస్టు బీజాలు పడ్డాయన్నారు. ఆనాడు కాకినాడ అన్నదాన సమాజంలో రహస్యంగా పార్టీ ఏర్పడిందన్నారు. 1934-1964 మధ్య జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ ఘట్టాలను వివరిస్తూ శేషబాబ్జి పుస్తకం రచించడం అభినందనీయమన్నారు. బూర్జువా భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేయడం కమ్యూనిస్టుల కర్తవ్యం కావాలన్నారు. యువకులు ఈ చరిత్ర పుస్తకాన్ని అధ్యయనం చేయడం ద్వారా సమాజంలో మార్పు కోసం ఏమి చేయాలో మార్గ నిర్దేశం చేయడానికి తోడ్పడుతుందన్నారు. గడిచిపోయిన ఘటనకు సంబంధించింది కాదు చరిత్ర, భవిష్యత్తుకు మార్గ నిర్దేశం చేసేది చరిత్ర అన్నారు. ప్రజా ఉద్యమాలను ఏకం చేయడమే ముందున్న కర్తవ్యమని పిలుపునిచ్చారు. బూర్జువా, భూస్వామ్య పార్టీల కుట్రలు, కుతంత్రాలు ఎదుర్కొని ప్రజలను ఐక్యంగా నిలబెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో చరిత్ర వక్రీకరణ జరుగుతుందని, సామాన్యుల చరిత్రను పక్కనపెట్టి దాని స్థానంలో మతోన్మాద చరిత్రను ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీన్ని అడ్డుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ చెలికాని స్టాలిన్, డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, సిపిఎం తూర్పు గోదావరి జిల్లా టి. అరుణ్, సిపిఐ నాయకులు తాటిపాక మధు, బోడ కొండ, కె.సత్తిబాబు, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, లిబరేషన్ నాయకులు గొడుగు సత్యనారాయణ, చిన్నబిల్లి నాగేశ్వరరావు, సిపిఐఎంఎల్ నాయకులు నాగరాజు, కొండ దుర్గారావు, తదితరులు మాట్లాడారు. దేశాన్ని మతోన్మాద శక్తుల బారినుంచి కాపాడుకోవాలన్నారు. ఐక్య ఉద్యమాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శేషబాబ్జి కృషిని అభినందించారు. కమ్యూనిస్టు ఉద్యమం అమరులైన నాయకుల కుటుంబ సభ్యులు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో అమరుల ఫోటోలతో పాటు వారి గురించి క్లుప్తంగా తెలియచేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సభకు ముందుగా అమరులకు నివాళులు అర్పించారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, రచయిత దువ్వా శేషబాబ్జీ, జిల్లా కమిటీ సభ్యులు జి.బేబిరాణి, కెఎస్.శ్రీనివాస్, సిహెచ్.రమణి, సిహెచ్. రాజ్‌కుమార్, నీలపాల సూరిబాబు, నగర కమిటీ సభ్యులు కె. సత్తిరాజు, మలక వెంకట రమణ, దుంపల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సభకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పలివెల వీరబాబు ఆహ్వానం పలుకగా, ఎం.రాజశేఖర్ వందన సమర్పణ చేశారు. ప్రజా నాట్య మండలి కళాకారులు ఆలపించిన అభ్యుదయ గీతాలు అలరించాయి.

క్రికెట్ స్టేడియం నిర్మించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు టౌన్‌లో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని, మినీ స్టేడియం నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని మినీ స్టేడియం సాధన పోరాట కమిటీ కన్వీనర్ జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆదివారం క్రీడాకారులతో రాంబాబు మాట్లాడారు. ఒకప్పుడు జిల్లాలోనే నిడదవోలు టౌన్ క్రీడలకు ప్రసిద్ధి చెందిందన్నారు. అనేక క్రీడల్లో జాతీయ స్థాయిలో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన క్రీడా కారులు ఇక్కడ ఉన్నారన్నారు. క్రీడా మైదానం లేక క్రీడాకారులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తే క్రికెట్‌తో పాటూ ఇతర క్రీడలు ఆడుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. క్రీడా మైదానం కోసం ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని రాంబాబు డిమాండ్ చేశారు దీనిపై మద్దతు కోరుతూ పట్టణంలో పుర ప్రముఖులు స్వచ్ఛంద సంస్థలు క్రీడాకారులు వాకర్స్ వ్యాయామ శిక్షకులు, విద్యార్థులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు రాంబాబు తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి - కోరుకొండ

ప్రముఖ పుణ్యక్షేత్రం కోరుకొండ శ్రీలక్ష్మి నరసింహస్వామి కల్యాణోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏడాదీ పాల్గుణ శుద్ధ ఏకాదశి నుంచి ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ఆలయ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ చేశారు. సోమవారం రథోత్సవం, కళ్యాణోత్సవం జరుగనుంది. కోరుకొండతో పాటూ జిల్లా నలుమూలల నుంచి ఈ కల్యాణోత్సవాలకు హాజరవుతారు.

కార్టూ'నిజం'



ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదం : డిఐ దిలీప్ కుమార్
ఒక్క చిత్రంతో వేయి భావాలు : దామెర్ల ప్రేమ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గోదావరి బాలోత్సవం- మనం ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో దానవాయి పేట మున్సిపల్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన చిత్రలేఖం పోటీల్లో చిన్నారులు, కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం, దామెర్ల రామారావు 128వ జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు వేయి మంది ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు.

ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభకు గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.తులసి, మనం ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి నవీనకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజమహేంద్రవరం అర్బన్ డిఐ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ గతంలో క్రియ పిల్లల పండుగ కాకినాడలో నిర్వహించేవారన్నారు. అదే స్థాయిలో గత రెండేళుగా చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుక గోదావరి బాలోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. మొబైల్ వినియోగం ఇటీవల విపరీతంగా పెరిగిందన్నారు. చిన్నారులు సైతం వాటికి బానిస అవుతున్నారన్నారు. మొబైల్‌కు దూరంగా ఉంచాలన్నారు. పుస్తక పఠనాన్ని అలవర్చాలన్నారు. విజేతలకు అభినందనలు తెలిపారు. దామెర్ల రామారావు మనవరాలు దామెర్ల ప్రేమ మాట్లాడుతూ ఒక బొమ్మ వెయి భావాలను పలికిస్తుందన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాధాన్యతను వివరించారు. గోదావరి బాలోత్సవం- మనం ఆర్ట్స్ అకాడమి నిర్వాహకులకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మనం ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ మాట్లాడుతూ ఆదివారం సెలవు రోజైనప్పటికీ పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారని, పరీక్షలు ఉన్నప్పటికీ ఆర్ట్స్ కాంపిటీషన్‌కు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బుర్రకథ, ఆంధ్ర నాట్యం , కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులకు డిఐ డిలీప్ కుమార్, దామెర్ల ప్రేమ జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం నిర్వాహనలో అద్దంకి రాజయోనా, రాజకుమార్, శ్రీనివాస్, కిషోర్, గాయత్రి, లక్ష్మి, ప్రియాంక జడ్జి లుగా వ్యవహారించారు. బాలోత్సవం నాయకులు ఆనంద్, కుసుమ, మెడిద నాగేశ్వరావు, సురేష్, భాస్కర్, రాజేష్, మహేష్, పవన్ పాల్గొన్నారు.

పోటీలకు హాజరైన విద్యార్థులు

మాట్లాడుతున్న డిఐ దిలీప్‌కుమార్

బహుమతులు అందిస్తున్న దిలీప్‌కుమార్, ప్రేమ

చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

పంటలకు సాగునీరు విడుదల

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చిలకపాడు పంటలకు నష్టం వాటిల్లకుండా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. సాగునీరందని పంట పొలాలు శీర్షికన ప్రజాశక్తి దినపత్రిక ఈ నెల 9న వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. సాగునీటిని వెంటనే విడుదల చేసినట్లు తెలిపారు. బీటలు వారిన వరి చేలను వ్యవసాయ శాఖ అధికారి ఎం.విశ్వాసరావు ఆదివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తమ సమస్య తెలుసుకుని, వార్తను ప్రచురించిన ప్రజాశక్తికి బాధిత రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

శివకుమార్‌కి ఉత్తమ నావికా వెటరన్స్ అవార్డు

సీతానగరం : మాజీ ఇండియన్ నేవీ అధికారి డాక్టర్ సూరెడ్డి శివకుమార్‌కు ఇండియన్ ఆర్మ్డ్ ఫోర్సెస్, ఇండియన్ నేవీ ట్రైనింగ్ ఎస్టాబ్లిష్మెంట్, ఐఎన్‌ఎస్ చిల్కా ఉత్తమ నావికా వెటరన్స్ అవార్డు దక్కింది. వంగలపూడి గ్రామానికి చెందిన శివకుమార్ 4 జనవరి 1986న ఇండియన్ నేవీలో చేరారు. 31 జనవరి 2001న రిటైర్ అయ్యారు. దక్షిణ భారతదేశంలో ఈ అవార్డు పొందిన మొదటి వ్యక్తి శివకుమార్ కావడం గమనార్హం. సామాజిక సేవా, విద్య, మాజీ సైనికుల సంక్షేమం మొదలైన అంశాల ఆధారంగా డిల్లీ నావికా ప్రధాన కార్యాలయం ఆయన్ని అవార్డుకు ఎంపిక చేసింది. ఒడిశాలోని2/2024 బ్యాచ్ అగ్నివీర్స్ పాసింగ్ అవుట్ పరేడ్ ఐఎన్‌ఎస్ చిల్కా ఇండియన్ నేవీ శిక్షణ కార్యాలయంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

మహా ధర్నాకు అంగన్‌వాడీల పయనం

ప్రజాశక్తి - చాగల్లు

విజయవాడలో సోమవారం నాడు మహా ధర్నాకు అంగన్వాడి కార్యకర్తలు మొత్తం 52 మంది గాను ఆదివారం మధ్యాహ్నం మండలం నుండి10 మంది అంగనవాడి కార్యకర్తలు విజయవాడకు చేరుకున్నారు . మరికొంతమంది సోమవారం తెల్లారి జామున విజయవాడ వెళ్లడం సన్నద్ధమయ్యారు

వారి కలయిక అ'పూర్వం'

ప్రజాశక్తి - తాళ్లపూడి

వారంతో చిన్ననాటి స్నేహితులు.. 40 ఏళ్ల తరువాత ఆదివారం ఒక చోట మళ్లీ కలిశారు. ఈ అపురూప ఘట్టానికి తాళ్లపూడిలోని శ్రీ పరసపద్మ రాజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. 1984-85 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అదే పాఠశాలలో ఆదివారం కలుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు ఆంజనేయులు, సుశీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి పరస రాధాకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అప్పటి విద్యార్థులు జడ్డు శ్రీను, తైలం రామకష్ణ, జి.తారారామ్ పాల్గొన్నారు.

చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం వద్దు

ప్రజాశక్తి - బిక్కవోలు

అనపర్తి నియోజకవర్గం బలభద్రపురం - కాపవరం గ్రామాల్లో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటును అనపర్తి ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన బలబద్రపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బలభద్రపురం - కాపవరం గ్రామ పరిధిలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రాన్ని నిర్మించే దిశగా పరిశీలన జరుగుతుందని, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దీని నిమిత్తం స్థలాలు పరిశీలించినట్టు వార్తాపత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. ఈ ప్రతిపాదనను ఈ ప్రాంత ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రతిపాదనను ఆమోదించేది లేదని స్పష్టం చేశారు. నాడు టిడిపితో పాటు మిగతా రాజకీయ పక్షాలు పబ్లిక్ హియరింగ్‌లో గ్రాసిం ఇండస్ట్రీ స్థాపనను తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. కాని వైసిపి ప్రభుత్వం గ్రాసిం సంస్థతో కుమ్మక్కై రసాయనాల పరిశ్రమ, కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమను స్థాపించారన్నారు. నేడు వందలాది వాహనాలు తిరుగుతూ తీవ్ర కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయన్నారు. అందువల్ల చుట్టుపక్కల ఏ గ్రామంలోనూ లేని విధంగా ఇక్కడ వందలాది మంది కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. గ్రాసిమ్ ఇండస్ట్రీ కాలుష్యమే దీనికి కారణమనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందన్నారు. అటువంటి పరిస్థితులలో తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లోని మున్సిపాలిటీల నుంచి వచ్చే చెత్తను ఇక్కడకు తీసుకొచ్చి పరిశ్రమను స్థాపిస్తే బలభద్రపురం, కాపవరం గ్రామాలతో బాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు కూడా ఖాళీచేసి వెళ్ళిపోవాల్సిన పరిస్థితి దాపురిస్తుందన్నారు. స్థానిక సర్పంచ్, ఎంపిటిసిలకు, ఎంఎల్‌ఎకు ఎలాంటి సమాచారం ఇవ్వాకుండా ప్రతిపాదన ఎలా పంపించారో సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరతామన్నారు.

ఆమోదించిన ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆమోదించిన ప్లానుల ప్రకారమే గ్రామాల్లో నిర్మాణాలు జరిగేలా చూసుకోవాలని రుడా వైస్ ఛైర్మన్ కేతన్‌గార్గ్ పంచాయతీ కార్యదర్శులు, రుడా అధికారులను ఆదేశించారు. పిడింగొయ్యి, గాడాల పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణము కోసం దాఖలు చేసుకున్న ప్లాన్‌లను, లే ఔట్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలతో కలిపి మాస్టర్ ప్లాను తయారు చేసినందున గ్రామాల్లో నిర్మాణము చేసే కట్టడాలు నిబంధనలకు అనుగుణంగానే ఉండాలన్నారు. లే ఔట్లను కూడా నిబంధనల ప్రకారమే తయారు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. పంచాయితీ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు కట్టడాలను పరిశీలించాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా కట్టడాలను నిర్మించకుండా చూసుకోవాలన్నారు. సర్వేయర్లు వారి పరిధిలోకి వచ్చిన లే ఔట్లలో నిబంధనల ప్రకారము ఓపెన్ స్పేస్‌లు వదిలారా లేదా అనేది, యుటిలిటీ ఏరియా నిబంధనల మేరకు ఉందా లేదా అనేది పరిశీలించాలన్నారు. రోడ్లు పంచాయతీలకు అప్పగించారా లేదా అనేది పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో రుడా అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజేశ్వరికి 'వండర్ ఉమెన్' పురస్కారం

ప్రజాశక్తి-కడియం

కడియపులంక గ్రామానికి చెందిన జనసేనపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడపాటి రాజేశ్వరికి "వండర్ ఉమెన్' పురస్కారం దక్కింది. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ వారు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం విజయవాడలో ఘనంగా నిర్వహించారు. నిత్యం సమాజంలో బడుగు బలహీన వర్గాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల నిత్యం పోరాడుతున్న నేపథ్యంలో బోడపాటి రాజేశ్వరిని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. సంస్థ నేషనల్ చైర్మన్ డాక్టర్ జ్ఞాన సుందరి, వైస్ చైర్మన్ వంగా ఆంజనేయులు చేతులు మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ తరపున బోడపాటి రాజేశ్వరి ఆంధ్రప్రదేశ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండర్స్, నేషనల్ లీడర్స్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిర్బంధం

ప్రజాశక్తి - శంఖవరం, ఉండ్రాజవరం

సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల హామీలు అమలు చేయాలంటూ వచ్చే విజయవాడ బయలు దేరిన అంగన్‌వాడీలను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించారు. శంఖవరం ఐసిడిఎస్ పరిధిలోని సుమారు 30 మంది అంగన్‌వాడీలు విజయవాడ వెళ్లేందుకు అన్నవరం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. వల్లో విజయవాడకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. అంగన్‌వాడీలను అడ్డుకోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉండ్రాజవరంలో మండలంలో అంగన్‌వాడీల నుంచి పోలీసులు సంతకాలు తీసుకున్నారు. విజయవాడ వెళ్లకుండా ఈ సంతకాలు తీసుకున్నట్టు అంగన్‌వాడీలు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఐసిడిఎస్ కార్యాలయంలో జరిగే సమావేశానికి ఉదయం 9గంటలకు కచ్చితంగా హాజరు కావాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు అంగన్‌వాడీలకు హుకుం జారీ చేశారు. దీనిపై అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తెలిపారు. మార్చి 17వ తేదీ నుంచి 1వ తేదీ వరకూ 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి' జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావును పలకరించింది. పకడ్బందీగా, పారదర్శకంగా, నిస్పక్షపాతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెల్లడించిన వివరాలు మాటల్లోనే..

జిల్లా వ్యాప్తంగా 25,723 మంది విద్యార్థులు

మార్చి 17 నుంచి నిర్వహించే 10వ తరగతి పరీక్షలకు సంబంధించి మొత్తం 25,723 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో రెగ్యులర్, ప్రయివేట్ విద్యార్థిని, విద్యార్థులు 24,763 మంది కాగా ఒఎస్‌ఎస్‌సి ప్రయివేట్ విద్యార్థినీ, విద్యార్థులు 960 మంది ఉన్నారు. విద్యార్థి భవిష్యత్తుకు 10వ తరగతి తొలి మెట్టు. ఈ తరుణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణను అందించాం. స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసి పరీక్షలకు సన్నద్ధం చేశాం. పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశాం.

134 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

జిల్లాలో 134 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతున్నాయి. విద్యార్థులను 8.45కు కేంద్రాల్లోకి అనుమతిస్తాం. ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించేది లేదు. పరీక్ష కేంద్రాలను ముందుగానే ఒకసారి తనిఖీ చేసి లోటుపాట్లు ఉంటే ముందుగానే చక్కదిద్దుతున్నాం. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, బిపి, షుగర్ చెక్ చేసే పరికరాలు, అత్యవసర మందులతో వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఒకరు అందుబాటులో ఉంటారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

జిల్లాలో 6 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాం. ఆయా కేంద్రాల వద్ద ప్రత్యేకమైన నిఘా ఏర్పాట్లు చేపట్టనున్నాం. మాస్ కాపీయింగ్‌ను

ముఖాముఖి

నిరోధించేందుకు 5 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేయనున్నాం. స్క్వాడ్స్ ప్రతిరోజూ ఆయా కేంద్రాలను తనిఖీ చేస్తాయి. అలాగే సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నాం. పరీక్ష విధుల్లో ఉన్నవారు మినహా బయటి వ్యక్తులను కేంద్రాల్లోకి అనుమతించరు. దివ్యాంగులకు అవసరమైతే స్క్రయిబ్స్‌ ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించాం. డిఇఒ, ఎడిఇ, ఇన్విజిలేటర్లు, స్క్వాడ్స్, సి- కార్ కస్టోడియన్స్ మొత్తం 1100 మందిని నియమించాం.

పరీక్షా ప్రశాంతతతో విద్యార్థులను సిద్ధం చేశాం

విద్యార్థులను ప్రణాళికా బద్ధంగా సిద్ధం చేశాం. తెలుగు విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని గుర్తించి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. విధంగా ప్రతి రోజూ పరీక్షల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయం దూరం చేశాం. విద్యార్థులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా. ఈ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆకాంక్షిస్తున్నాం.

వర్మకు మళ్లీ మొండి చేయి

-అసంతృప్తిలో వర్గీయులు
-పార్టీ మార్పుపై ఊహాగానాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయాలు రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతున్నాయి. గత సాధారణ ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ కోసం టికెట్‌ను త్యాగం చేసిన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈసారైనా ఎంఎల్‌సి పదవి దక్కుతుందని ఆశించినప్పటికీ భంగపాటు తప్పలేదు. టిడిపి అధిష్టానం ఆయనకు మరోసారి మొండి చేయి చూపింది. ఆదివారం సాయంత్రం ప్రకటించిన ఎంఎల్‌సి కోటాలో ఎంఎల్‌సి స్థానంలో అవకాశం దక్కుతుందని అంతా భావించారు. ముఖ్యంగా వర్మ కేడర్ అంతా ఎంఎల్‌సి వచ్చేస్తున్నట్లుగా ఇప్పటికే ప్రచారం చేసుకున్నారు. తీరా జాబితా విడుదల చేసిన తర్వాత వర్మకు ఈసారి కూడా హ్యాండ్ ఇవ్వడంతో ఇప్పుడు అనుచరులు అధిష్టానం తీరుపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో వర్మ పార్టీ మారనున్నారా? అనే ప్రచారం కూడా నియోజకవర్గంలో జోరుగా సాగుతుంది. వైసిపిలోకి చేరిపోతారని ప్రచారం ఊపందుకుంది. వర్మకు ఎంఎల్‌సి అవకాశం దక్కని నేపథ్యంలో తీవ్ర అసహనంతో ఉన్న ఆయన భవిష్యత్తు ప్రణాళికను త్వరలోనే ప్రకటిస్తారని సంకేతాలు అనుచరుల నుంచి వినిపిస్తున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకున్నందుకు ఆయనకు తొలి విడతలోనే ఎంఎల్‌సి వస్తుందని అంతా ఆశించారు. ఆయన అభిమానులు కూడా కాబోయే ఎమ్మెల్సీ వర్మ అంటూ ప్రచారం చేసుకున్నారు. రెండు మూడు సందర్భాల్లో వర్మను చట్టసభలకు పంపేలా కృషి చేస్తామని పవన్ కళ్యాణ్ కూడా చెప్పుకొచ్చారు. కానీ తీరా మరోసారి ఖాళీ అయిన 5 శాసన మండలి స్థానాలకు ఎన్‌డిఎ కూటమి తరపున ఖరారు చేసిన అభ్యర్థుల్లో వర్మ పేరును పరిగణలోకి తీసుకోలేదు. 5 సీట్లకు గానూ ఒకటి జనసేన నేత నాగబాబుకి, మరొకటి మోపిదేవి వెంకటరావు, మిగిలినవి కావలి గ్రీష్మ, బిటి.నాయుడు, బీదా రవిచంద్రలకు ఖరారు చేశారు. అయితే ఒక స్థానాన్ని వర్మకు ఖాయమని ఆశించినా వారికి నిరాశ తప్పలేదు. ఇది పిఠాపురం నియోజకవర్గ రాజకీయాల్లో మరోసారి పెద్ద చర్చనీయశంగా మారింది.

తీవ్ర అసహనంలో వర్మ

తనకు ఎంఎల్‌సి పదవి దక్కకపోవడంతో తాజాగా వర్మ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పార్టీ కోసం, పవన్ కళ్యాణ్ గెలుపు కోసం త్యాగం చేసినా తమకు తగిన శాస్తి చేశారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా ఆయన అనుచరులు చెప్పుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసిపిలోకి చేరేందుకు ఆలోచనలు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. దీంతో మాజీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డితో ఇప్పటికే ఆయన సంప్రదింపులు జరిపినట్లుగా నియోజకవర్గంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అధిష్టానం తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన అతి త్వరలోనే తన నిర్ణయాన్ని బహిరంగంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టిడిపి అధిష్టానం వర్మను మరోసారి బుజ్జగిస్తుందా.. లేకపోతే వేరే ఇతర పదవుల ఆశ కల్పిస్తుందా అనేది వేచి చూడాలి.

తాటిపాక నీటి సంఘం సమావేశం

సాగు నీటి సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -మామిడికుదురు

సాగు నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తాటిపాక నీటి సంఘం అధ్యక్షులు కడలి కృష్ణమోహన్ అన్నారు. కొమరాడలో కృష్ణమోహన్ అధ్యక్షతన ఆదివారం తాటిపాక నీటి వినియోగదారుల డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకునందుకు రాజోలు ఎంఎల్ఎ దేవా వరప్రసాద్‌కు ఛానెల్ పరిధిలో రైతులకు, కూటమి నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ రబీ పంట చివరి దశకు చేరుకోవడంతో నీటి ఎద్దడి రాకుండా ప్రతీ డైరెక్టర్ వారి పరిధిలో రైతులతో మమేకమై నీరు అందేలా సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇకను ఏవైనా సమస్యలు ఉంటే నా దష్టికు తీసుకురావాలని ఆ సమస్యలు అధికారులతో చర్చించి పరిష్కారం అయ్యేలా చర్య తీసుకుందామని డైరెక్టర్లకు అధ్యక్షులు సూచించారు. ఈ పంట పూర్తి అయిన తరువాత వేసవి కాలంలో కాలవల పూడిక తీయుట, అవసరమైన చోట్ల రిటర్నింగ్ వాల్స్, వంతెనలు నిర్మించేందుకు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్, కోనసీమ సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అధికారులతో చర్చించి కృషి చేస్తామన్నారు ఈ సమావేశం లో డైరెక్టర్లు అప్పారి వెంకటేశ్వరావు, నేదూరి శ్రీనివాసరావు, చెగొండి పద్మావతి, జక్కంపూడి సూర్యప్రకాష్ రావు, పులఖండం సీత, ఆకుల మల్లేశ్వరరావు, విత్తనాల త్రిమూర్తులు, అనసూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లా పులివెందులలో నిర్వహించనున్న 34వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి బాలుర, బాలికల కబడ్డీ జట్లు ఎంపిక జరిగింది. ఆదివారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలుర జట్లులో 12 మందిని, బాలికల జట్టులో 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఈ ఎంపిక కార్యక్రమంలో ప్రో కబడ్డీ తెలుగు రాష్ట్రాల రెఫరీ భోగిళ్ళ మురళీకుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బడుగు శ్రీకాంత్, కోశాధికారి నిమ్మకాయల కిరణ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, రిటైర్ వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, వ్యాయామ ఉపాధ్యాయులు పోలరాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

బాలురు, బాలికల జట్టులో సభ్యులు వీరే

బాలుర జట్లులో జి.త్రిమూర్తులు, జి.నరేష్, సిహెచ్‌ఎంకె.రెడ్డి, కె.అభిరామ్, కె.ప్రవీణ్‌కుమార్, బి.అజయ్, సిహెచ్‌పివిఎస్.శ్రీహర్ష, వి.సూర్యచరణ్, బి.మనోజ్, వై.సామ్రాట్, జి.వీరబాబు, ఎం.దుర్గాప్రసాద్ రావు ఎంపికయ్యారు. అలాగే బాలికల జట్టులో ఎంవి.దుర్గామహాలక్ష్మి, ఎస్.భవాని, టి.మహేశ్వరి, బిహెచ్.వరలక్ష్మి, ఎజి.భవాని, సిహెచ్‌వి ఆర్‌పి.దుర్గభవాని, బి.దివ్యశ్రీ, ఎ.భార్గవి, సిహెచ్ ఎల్.ప్రత్యూష,ఎంఎల్‌వి.దుర్గ, జి.శిరీష, వర్షిత ఎంపికయ్యారు.

బాధిత చిన్నారికి చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.24 లక్షల విలువ చేసే చెక్కులను ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ఆదివారం పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని తాళ్లరేవు, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు సంబంధించిన 29 మంది లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, చెల్లి అశోక్, టేకుముడి లక్ష్మణరావు, దొమ్మేటి రమణకుమార్, ధూళిపూడి వెంకటరమణ, సంగాని వెంకటేష్, వనచర్ల వెంకటేశ్వరరావు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, రాయపురెడ్డి మాణిక్యం పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిరావాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు, పెద్దాపురం

ఈనెల 14న పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభకు పెద్దఎత్తున తరలిరావాలని ఎపి అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని గాడిమొగ, చినవలసల, పెదవలసల, తాళ్లరేవు గ్రామాల్లో ప్రజలను కలుసుకుని జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవంకు తరలిరావాలని కోరారు. పెద్దాపురం ఆర్యవైశ్య సేవా సంఘ భవనంలో జనసేన కార్యకర్తలతో జరిగిన సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షులు, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు పాల్గొని మాట్లాడారు. పట్టణంలో జనసేన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో గడసాల అప్పారావు, కిరణ్ ప్రసాద్, ప్రత్తిపాడు జనసేన ఇన్‌ఛార్జ్ వరుపుల తమ్మయ్యబాబు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు

బచ్చు ఫౌండేషన్ ఛైర్మన్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి - పెద్దాపురం

బచ్చు ఫౌండేషన్ ఛైర్మన్ బచ్చు అవినాష్ దేవీచంద్రకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ఈ అవార్డును ఆయన దుబాయ్‌లో అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అవినాష్‌ను విద్య, సామాజిక ప్రభావ నాయకత్వం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు పొందినందుకు అభినందించారు.

అభినందిస్తున్న చంద్రబాబు

ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక బెరాకా ప్రార్థన మందిరంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఫెలోషిప్ నూతన అధ్యక్షులుగా కుంపట్ల పాల్‌ప్రసాద్, కార్యదర్శిగా సంపత్ ప్రభుదాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాస్టర్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షులుగా జాన్ విల్సన్‌బాబు, సంఘ ఫౌండర్ ఎస్.ఎలైజా, ఉపాధ్యక్షులుగా ఎబివి.ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా పల్లి నిల్సన్, ట్రెజరర్‌గా వాసా సామ్యేల్, జాయింట్ ట్రెజరర్‌గా బొన్ కుమార్‌పాల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కుంపట్ల పాల్ ప్రసాద్ మాట్లాడుతూ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని, అధ్యక్ష పదవి అంటే నాయకత్వం కాదని సంఘ సభ్యులు అందరితో కలిసి నిర్ణయం తీసుకుని ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను సంఘ సభ్యులు అందరితో కలిసి పోరాడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మిరాకిల్ మినిస్ట్రీ డైరెక్టర్ పి.ప్రవీణ్‌పాల్, జిల్లా నాయకులు జోసెఫ్ ఆంద్రూస్, రీజనల్ నాయకులు కె.మణికుమార్, సునీతపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన నూతన కార్యవర్గం సభ్యులు

బలవంతపు చేరికలు వద్దు : యనమల

ప్రజాశక్తి - తుని

బలవంతంగా ఇతర పార్టీలకు చెందిన వారిని పార్టీలోకి చేర్చుకోవలసిన అవసరం లేదని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ఆదివారం తేటగుంటలోని టిడిపి కార్యాలయంలో తొండంగి మండలం టిడిపి అధ్యక్షుడు చొక్కా అప్పారావు అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, క్షేత్రస్థాయిలో ప్రజా అవసరాలను గుర్తించి అభివృద్ధి పనుల ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఏకపక్ష నిర్ణయాలు విడనాడి సమిష్టిగా పనిచేయాలని హితవు పలికారు. ఇతర పార్టీల వారిని బలవంతంగా టిడిపిలోకి తీసుకురావద్దని, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించే వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ నేతలు యనమల రాజేష్, విజయబాబు, కోడా వెంకటరమణ, సిద్ధా రాంబాబు, బైరవర్జుల చందు, చొక్కా కాశీ, మనిమల కొండబాబు, అంగుళూరి సుధాకర్, కాలిబోయిన చంద్రరావు, సిద్ధా రాంబాబు, అరిగెల నర్సింహమూర్తి, కొయ్యా కేశవ్, తాటిపర్తి శ్రీను, నేమాల కృష్ణ, దూలం మురళిపాల్గొన్నారు

డైమండ్ జూబ్లీ ఫంక్షన్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కరప

పెద్దాపురప్పాడులో బిరుదమోర్త నారాయణ జడ్‌పి హైస్కూలు ఏర్పాటుచేసి 75 సంవత్సరాలు పూర్తి కానున్న నేపథ్యంలో డైమండ్ జూబ్లీ ఫంక్షన్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు పూర్వపు విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం బొండా సూర్యనారాయ అధ్యక్షతన పూర్వ విద్యార్థులుతో సమావేశం ఏర్పాటుచేశారు. ఏప్రిల్ 26, 27 వ తేదీల్లో ఈ వేడుకను నిర్వహించేందుకు నిర్ణయించారు. దేశ విదేశాలలో ఉన్న పూర్వ విదార్థులను ఆహ్వానించాలని తీర్మాణించారు. ఈ కార్యక్రమంలో చిక్కం రామచంద్రరావు, యర్రంశెట్టి కొండ, నల్ల సత్యనారాయణ, సలాది మూర్తి, తోలు మూర్తి పాల్గొన్నారు.

ఏర్పాట్లపై సమావేశమైన పూర్వపు విద్యార్థులు

ఆటో యూనియన్ అధ్యక్షునిగా కాసులు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ ఆటో యూనియన్ నూతన కమిటీ అధ్యక్షులుగా మామిడాల కాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ చిన్ని ఆధ్వర్యంలో ఆటో యూనియన్ అధ్యక్షుడుగా కాసులు, లీగల్ అడ్వైజర్‌గా న్యాయవాది చిక్కం ఈశ్వరుడు ఎన్నికయ్యారు.

నేరాలు ఘోరాలు

ఎక్సైజ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి సంఘటనకు బాధ్యుడిగా ఎక్సైజ్ కానిస్టేబుల్ బి.ఆనంద్‌రాజును సస్పెండ్ చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై.చైతన్యమురళి తెలిపారు. కరప మండలం గురజనాపల్లి శివారు అడవి పూడి గ్రామానికి చెందిన కోట శ్రీరామ్(21), పిఠాపురానికి చెందిన మరొక యువకుడు యానం నుంచి వెళ్తుండగా సుంకరపాలెం చెక్ పోస్ట్ సిబ్బంది మద్యం ఉందనే అనుమానంతో వెంబడించారు. దీంతో వాహనాన్ని వేగంగా నడుపుతూ లారీని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో శ్రీరామ్ మృతి చెందగా మరో వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనపై మృతుని బంధువులు చెక్ పోస్టను ముట్టడించి ఆందోళనకు దిగారు. దీంతో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ కేసులో ప్రాథమికంగా ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జరిమానా

ప్రజాశక్తి - సీతానగరం

మద్యం సేవించి ట్రాక్టర్లు నడిపిన ముగ్గురు డ్రైవర్లకు రాజమహేంద్రవరం మూడో ఎజిఎఫ్‌సిఎం కోర్టు జరిమానాలు విధించింది. మహాశివరాత్రి రోజున కోరుకొండ సిఐ సత్య కిషోర్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. బొబ్బిలంక గ్రామానికి చెందిన చేబ్రోలు రాజు, తొర్రేడు గ్రామానికి చెందిన కవల చక్రధర్, వంగలపూడి గ్రామానికి చెందిన బుర్ర సతబాబు మద్యం సేవించినట్లు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో తేలింది. ఈ మేరకు నేరం రుజువు కావడంతో ఒక్కక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి సి.రమ్య తీర్పునిచ్చారని ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ఖండవల్లి జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున 3.గంటల ప్రాంతంలో పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం తూర్పువిప్పరు గ్రామం నుంచి కోనసీమ జిల్లా రావులపాలెం గ్రామానికి వ్యాన్‌లో రవాణా చేస్తున్న పది టన్నుల రేషన్ బియ్యాన్ని పెరవలి పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్ ఎస్‌ఎస్.సుధీర్‌రెడ్డి సీజ్ చేశారు. 6ఎ కేసు నమోదు చేశామని, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

యానాం వార్తలు

ఘనంగా 'శ్రీవేద' వార్షికోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాంలోని శ్రీవేద పబ్లిక్ స్కూల్ మూడవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, ఎడిపిసి కమిడి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్న రోబోటిక్స్, ఐఐటీ ఫౌండేషన్ కోర్సు మెటీరియల్‌ను వారు ప్రారంభించారు. స్కూల్ ఛైర్మన్ గుత్తుల గోవింద జయరామారావు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ పెండెం సూర్యప్రకాష్, దాట్ల దేవదానంరాజు తదితరులు మాట్లాడారు. విశ్రాంతి విద్యాశాఖ అధికారి రాచర్ల డేవిడ్‌రాజు, విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్లు అర్జున్, నీతూహరి, విద్యార్థులు, పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న అతిథులు

యానాం మహిళకు బహుమతి

ప్రజాశక్తి - యానాం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం కాకినాడలో సిటీ ఆఫ్ ట్రీస్ గార్డెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గార్డెనెర్స్ మీట్ కార్యక్రమంలో యానాంకు చెందిన పత్రి ధనలక్ష్మి బహుమతి పొందారు. వంటలు అలాగే కళాకృతులు పోటీలలో ధనలక్ష్మి పాల్గొనగా వంటల పోటీలో తృతీయ బహుమతిని ఆమె సాధించారు. ప్రదర్శన అనంతరం జరిగిన బహుమతుల ప్రధానోత్సవ సభలో ఇటీవల గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సిగా ఎన్నికైన పేరాబత్తుల రాజశేఖరం చేతుల మీదుగా ధనలక్ష్మి మెమెంటోతో పాటు బహుమతిని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ఆఫ్ ట్రీస్ గార్డెన్స్ సంస్థ ప్రతినిధులు, ం పాల్గొన్నారు.

వైద్యురాలికి క్షమాపణ చెప్పిన తమ్మయ్యబాబు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం వైద్య సిబ్బంది, కూటమి నేతలకు మధ్య జరిగిన ఘర్షణలో వైద్యురాలు శ్వేతకు ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ తమ్మయ్య బాబు ఆదివారం సాయంత్రం క్షమాపణ చెప్పడంతో వివాదం సర్దుమనిగింది. వివరాలలోకి వెళితే..శనివారం రోడ్ ప్రమాదంలో గాయపడ్డ బాలుడికి, బాలుడు తల్లికి వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం జరుగుతుందని బాధితులు తమ్మయ్య బాబుకు తెలిపారు. దీంతో తమ్మయ్య బాబు వైద్యురాలికి ఫోను ఇవ్వండి అని చెప్పడంతో వైద్యరాలు నేను వైద్యం చేస్తున్నానని, మీరు ఎవరో తెలియకుండా ఫోను మాట్లాడను అని చెప్పారు. దీంతో తమ్మయ్యబాబు వైద్యురాలిపై నేనెవరో తెలీదా అంటూ కేకలు వేశారు. దీంతో వివాదం చోటుచేసుకుంది. ఇదే అంశం డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి తమ్మయ్య బాబును మందలించడంతో ఆదివారం జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి కలిసి ఆసుపత్రికి చేరుకొని వైద్యురాలికి క్షమాపణ చెప్పారు. ఈ సందర్భంగా తమ్మయ్య బాబు మాట్లాడుతూ బాధితులకు వైద్యం అందకపోవడంతోనే నేను వైద్యురాలిపై కేకలు వేయడం జరిగిందని, వైద్యురాలిపై వ్యక్తిగతంగా కక్ష ఏమీ లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ మైకేల్ సౌమ్య, మేడిశెట్టి సూర్య కిరణ్, పెంటకోట మోహన్ పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న తుమ్మల బాబు

చిన్నారి వైద్యానికి ఎస్ఐ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెరవలి

మండలం పెరవలి గ్రామానికి చెందిన కళ్యాణి వరలక్ష్మి కుమార్తె మౌనిక(5) కాలికి ప్రమాదవశాత్తు తీవ్ర గాయమైంది. దీంతో ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు చిన్నారికి వైద్యం నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రైటర్ జయసింహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి మదనగోపాలుని కళ్యాణోత్సవాలు

తాళ్లపూడి : తాళ్లపూడిలోనే శ్రీరుక్మిణిసత్యభామ సమేత మదన గోపాలస్వామి వార్షిక కళ్యాణోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ ఛైర్మన్ సింహాద్రి జనార్ధనరావు తెలిపారు. ఈ ఉత్సవాలకు కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఆహ్వాన పత్రం అందజేశారు. బుధవారంతో ఉత్సవాలు ముగుస్తాయని చివరి రోజు గ్రామంలో భారీ అన్నదానం నిర్వహిస్తామని జనార్ధనరావు తెలిపారు.

దస్తావేజులు పడిపోయినవి

కాట్రేనికోన మండల పరిధిలోని పల్లంకుర్రు కాపరస్తులు కసిరెడ్డి సత్యనారాయణమ్మ W/O (లేటు) సత్యనారాయణ మూర్తి అనువారికి సంబంధించిన దస్తావేజు నెంబరు **1764/1967** గల ఒరిజినల్ దస్తావేజు బ్యాగ్ లో పెట్టుకుని 5/3/25 తేదీన కాట్రేనికోన వస్తుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. దొరికిన వారు ఈ కింద అడ్రస్ కు అందజేయగలరు

కసిరెడ్డి సత్యనారాయణమ్మ
పల్లంకుర్రు,కాట్రేనికోన మండలం,
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
ఫోన్ నెంబర్:9491684780

పాస్ పోర్టు పడిపోయినది

తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఈలకొలను గ్రామ రావిచెట్టు వీధి కాపురస్తులు లంక భద్రరావు గారి కుమార్డు లంక వీర మణికంఠ డోర్ నెం 2-58 యావన్మందికి తెలియ జేయునది ఏమనగా నా యొక్క పాస్ పోర్టు నెంబర్ **Y7698237,** తేదీ 19-09-2023 కలది. 25-02-2025 వ తేదీన మా ఇంటి నుండి రంగంపేట సెంటర్లో గల జిరాక్స్ షాపు నకు వెళ్లు చుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్ పోర్టు పడి పోయినది. ఎంత వెతికినను దొరకలేదు. కావునా ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు తెలియ జేయ గలరు.

లంక వీర మణికంఠ
S/o భద్రరావు డోర్ నెం.. 2-58,రావిచెట్టు వీధి..
ఈలకొలను రంగంపేట మండలం.. తూర్పుగోదావరి జిల్లా
సెల్ నెంబరు.9381935592

పాస్ పోర్టు పడి పోయినది

తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఈలకొలను గ్రామ వాటర్ ట్యాంక్ వీధి కాపురస్తులు దేవలంక శ్రీరాములు గారి కుమార్డు దేవలంక అయ్యప్ప డోర్ నెం 2-51 యావన్మందికి తెలియ జేయునది ఏమనగా నా యొక్క పాస్ పోర్టు నెంబర్ **S 3918499** తేదీ 9-11-2018 కలది. 20- 02- 2025 వ తేదీన మా ఇంటి నుండి దొంతమూరు లో గల జిరాక్స్ షాపు నకు వెళ్లు చుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్ పోర్టు పడి పోయినది. ఎంత వెతికినను దొరకలేదు. కావునా ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు తెలియ జేయ గలరు.

దేవలంక అయ్యప్ప
S/o శ్రీరాములు, డోర్ నెం.. 2-51, వాటర్ ట్యాంక్ వీధి ..
ఈలకొలను ,రంగంపేట మండలం.. తూర్పుగోదావరి
జిల్లా.సెల్.. 9948313486.